
కథ




# ఆత్మశాంతి

ద్వివేదుల సోమనాథశాస్త్రి

ఆనందరావుగారి జీవితం వడ్డించిన విస్తరి. ఏవో చిన్నచిన్న ఒడిదుడుకులు తప్పితే గడిపిన జీవితం అంతా నల్లేరు మీద నడకలా సాగింది. అన్నపూర్ణమ్మ అతని అనుకూలవతి అయిన భార్య. ఇద్దరూ సంసారాన్ని స్వర్గతుల్యం చేసుకున్నారు. ఇద్దరు కొడుకులూ, ఒక్క కూతురూ ఎవరి మానాన వారు హోదాగానే బ్రతుకుతున్నారు.

ఆనందరావుగారు రిటైర్ అయ్యాక ఓపిక, శక్తి వున్నంతకాలం పిల్లల్ని ఇబ్బంది పెట్టటం ఇష్టం లేక భార్యాభర్తలిద్దరూ స్వంత ఇంటిలోనే వున్నారు! పిల్లలే వచ్చిపోతూ ఉండేవారు. పిల్లలమీద ఆధారపడకుండా తనకు వచ్చే పెన్షన్‌తోనే హాయిగా వున్నారు.

అయిదేళ్ల క్రితం భార్యపోయిన తర్వాత ఆనందరావులోని ఉత్సాహం అంతా పోయింది. కష్టసుఖాల్లో పాలుపంచుకుని చేదోడువాదోడుగా ఉండే అర్ధాంగి లేకపోయేసరికి అంతా తణవుకున్నట్టు అయిపోయింది. అంత ధైర్యస్తుడూ తనంత తానుగా ఏమీ చేసుకోలేని అశక్తుడయిపోయాడు! తప్పనిసరిగా పెద్దకొడుకు దగ్గరకు వెళ్లక తప్పలేదు!

పెద్దకొడుకు తన ఆఫీసుకు దగ్గరగా ఒక ఫ్లాట్ కొనుక్కున్నాడు. ఆ ఫ్లాట్‌కి ఒకే ఒక సిట్‌అవుట్ ఉంది. అక్కడ కూర్చుంటే వీధిలో పోయే జనాల్ని చూస్తూ కూర్చుని కాలక్షేపం చేయువచ్చు. ఊసుపోదన్న చింతలేదు. అంచేత అక్కడ వాలుకుర్చీ వేసుకుని ఆనందరావుగారు పేపరో, పుస్తకమో చదువుకుంటూ కూర్చుంటారు.

అంతవరకూ బాగానేవుంది గాని ఒకటే పెద్ద ఇబ్బంది. ఎదురుగా ఖాళీస్థలంలో ఏ బిల్డింగూ కట్టలేదు! ఆ ఖాళీస్థలం వెనుక స్మశానం ఉంది. అందువల్ల సిట్‌అవుట్‌లో కూర్చునేవాళ్లకి అక్కడ రోజూ జరిగే తంతు అంతా కనబడుతూనే ఉంటుంది.

పూర్వం ఆ స్మశానం పట్టణానికీ దూరంగానే కట్టారు. కాని రాను రాను పట్టణం పెరగడం వల్ల పట్టణం వాళ్లు స్మశానం దగ్గరకి రావడానికి బదులు పట్టణమే స్మశానం దగ్గరికి వచ్చేసింది. చుట్టుపక్కల ఇల్లు లేచిపోవడం జరిగింది. అవన్ని స్వంతఇళ్లే కాబట్టి ఎవరికీ భయం, ఆక్షేపణా లేకుండా గడిపేస్తున్నారు. పిల్లలుకూడా అక్కడే ఆడుకుంటుంటారు.

కనీసం రోజుకొకరయినా అక్కడ ఆఖరి వెలుగు వెలుగుతూ ఉంటారు. చావు కూడా పెళ్లిలాంటిదే అన్నట్టుగానే కొందరు శవాలను బాజాలతో ఊరేగిస్తూ, బాణాసంచాలను కాలుస్తూ ముందర కొందరు గెంతుతూ పాడుతూ చాలా ఆర్భాటంగా తీసుకువస్తారు. కొంతమందయితే ఏ చప్పుడూ లేకుండా

ప్రశాంతంగా, నిశ్శబ్దంగా తెచ్చి దహనం చేస్తుంటారు. కొంతమంది భజనలు చేస్తూ తెస్తారు. కొంతమంది ఖననం చేస్తుంటారు వాళ్ల వాళ్ల ఆచారాల ప్రకారం.

ఎవరెలా తెచ్చినా ఆఖరికి ఇక్కడ పట్టి కావల్సిందే! ఇహ దహనం చేస్తారనగా చుట్టూవున్న ఇళ్లవాళ్లు ఆ శవం రాగానే కమురు కంపును భరించలేక తలుపులూ కిటికీలూ మూసుకుంటారు.

తెల్లవారు లేచింది మొదలు ఆ చుట్టుపక్కల జోపిడీ పట్టాల వాళ్లందరూ ఆ స్మశానంలోనే కాలకృత్యాలు తీర్చుకుంటారు. వాళ్లతోపాటు పశువులూ, గాడిదలూ, కుక్కలూ, పందులూ అందులోనే విహారం చేస్తూ ఉంటాయి.

ఇదీ అక్కడ రోజూ కనబడే దృశ్యం. ఆనందరావుగారికి ఇది చాలా బాధాకరంగా తయారయింది. అక్కడ కూర్చోలేరు. మానలేరు. ఊసుపోవాలంటే అక్కడ కూర్చోక తప్పదు. కూర్చోకపోతే ఇంట్లో గదిలో ఎంతకని తోస్తుంది. పోనీ వేరే ఇంటికి పోదామంటే అది అద్దెకొంప కాదు! స్వంత ఇంట్లో ఉండక అద్దె కొంపల్లో ఎందుకుంటారు? ఎవరయినా? ఎలా చెప్పగలరు? కొడుకుకి ఆవిధంగా చెప్పడానికి మొహమాట పడిపోయాడు.

"ఒకవేళ మరణిస్తే ఈ పాడు స్మశానంలో మాత్రం తన అంత్యక్రియలు జరుగకూడదు! భగవంతుడా!" అని అనుకొనేవాడు. ఈ విషయమే రోజూ తనతో వాకింగ్ వచ్చే మిత్రుడు విశ్వనాథంతో అనేవారు.

తన దగ్గర బంధువొకాయన ఆ మధ్య చనిపోతే తనూ ఆతని అంత్యక్రియలకి స్మశానానికి వెళ్లాడు. ఆ స్మశానవాటిక పేరు 'స్వర్గద్వారం'. పేరు తగ్గట్టుగానే ఆ ప్రదేశం అంత గొప్పగా ఉంది. ఎత్తయినా ప్రహరీగోడ చుట్టూ చక్కటి చెట్లూ లోపల అంతా పరిశుభ్రంగా ఉంది. వర్షం వస్తే శవాలుగాని, మనుషులు గాని తడవకుండా షెడ్డులున్నాయి. అక్కడే ఒక ప్రక్క ఎలక్ట్రికల్ క్రిమేషన్ కూడా ఉంది. దహనానికి కావలసిన సామాగ్రికోసం ఎక్కడికీ వెళ్లనక్కర్లేకుండా అక్కడే ఏర్పాట్లు ఉన్నాయి. ఇరవైనాలుగ్గంటలూ వచ్చే కొళాయిలున్నాయి. అవి కాకుండా రెండు నూతులున్నాయి. అస్థికలు ఉంచడానికి నెంబర్లు వేసిన గూళ్లున్నాయి. స్నానాలు చేయడానికి గదులున్నాయి. టాయిలెట్లు ఉన్నాయి. ముఖ్యంగా కాపలాదారులు అక్కడే ఉంటున్నారు. వాళ్లు అనవసరమైన వాళ్లని లోనికి రానివ్వడం లేదు. అన్నిటికీ ముఖ్యం శవదహనం చేసే చోట్ల నీటుగా తుడిచి శుభ్రం చేసి ఉన్నాయి. మూడోరోజు అస్తికలు తీసేవరకూ వాటిజోలికి ఎవరూ పోరు. ఆ స్మశానం ఊరికి చాలా దూరంగా ఉంది. అక్కడకు వచ్చిన వాళ్లకు తప్పితే మరెవ్వరికీ కనబడదు. అక్కడి వాతావరణం చాలా ప్రశాంతంగా ఉంది.

ఇదంతా చూసేసరికి ఆనందరావుగారికి ఎంతో ఆనందం కలిగింది. 'ఇక్కడ కడతేరినవారు చచ్చి సుఖపడతారు! ప్రాణం పోయిన తర్వాత నన్ను కూడా ఇక్కడే దహనం చేస్తే బాగుణ్ణు' అని అనుకున్నాడు.

భార్యపోయిన తర్వాత ఆనందరావుకి మరి బ్రతకాలని అనిపించలేదు. ఆమెకు తను ఏమీ చేయకపోయినా ఆమె తన గురించి తీసుకున్న జాగ్రత్త, చేసిన సేవలూ మరువగలడా? తనకు ఇంత మాత్రం జలుబు చేసినా అది తగ్గేవరకూ బెంగపెట్టుకుని ఎన్నో సపర్యలు చేసేది. తమ కుటుంబం కోసం ఎన్నో త్యాగాలు చేసింది. అంత వృద్ధాప్యంలో ఎలాగో ఓపిక చేసుకుని తనకిష్టమైనవన్నీ చేసిపెట్టేది. "మనకు ఎవరు చేసి పెడతారు? ఎలాగో మనకు మనమే చేసుకోవాలి!" అనేది. కుటుంబంలో, తన మంచితనం, సహృదయత వల్ల ఎంతో మంచిపేరు తెచ్చుకుంది. తన కష్టసుఖాలూ, ఇష్టాయిష్టాలూ ఎవరితో చెప్పుకోగలడు? అలాటి మంచి మనిషి, అన్నపూర్ణ లేనప్పుడు తను జీవచ్ఛవంలా ఉండి ఏం ప్రయోజనం?

ఎంత తొందరగా ఆమెను చేరుకుందామా అని రోజులు వెళ్లబుస్తున్నాడు.

ఒకనాటికి భగవంతుడు అతని మొర విన్నాడు. ఎవరి చేతా చేయించుకోకుండానే సునాయసంగా కన్నుమూశాడు. అతని ముఖం ప్రశాంతంగానే ఉన్నా ఏదో ఆందోళనతోనే పోయినట్టు ఉంది. అదెవరూ గమనించినట్టులేదు.

కర్మకాండ అంతా పూర్తయ్యేసరికి ఉదయం పది అయింది. అవతల బాగా ఎండగా ఉంది. బంధువులంతా మరో ఆలోచన లేకుండా ఎదురుగా ఉన్న స్మశానంలో దహనం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉన్నపాటున అకస్మాత్తుగా మబ్బులు క్రమ్ముకొచ్చి వర్షం మొదలయింది. శవాన్ని తీసువెళ్లే సమయానికి ఇలా అనుకోకుండా వర్షం రావడం అందరికీ ఆశ్చర్యం కలిగించింది. వచ్చినవాళ్లలో కొంతమందికి విసుగు, చికాకూ కలిగాయి. అలా రెండు గంటలసేపు వర్షం పడి వెలిసింది. అంతవరకూ వేచివుండి శవాన్ని కట్టెకు కట్టి లేవనెత్తబోయారు... ఇంకేముందు? మళ్లీ కుంభవృష్టి. శవాన్ని యథాస్థానంలో ఉంచేసారు. అందరూ ఎలాగరా భగవంతుడా అని ఆలోచనలో పడ్డారు. ఒకళ్ల చెవులొకరు కొరుక్కుంటున్నారు. మిగతావాళ్లకి కూడా అసహనం, విసుగూ వస్తున్నాయి. లోలోపల కొందరు తిట్టుకుంటున్నారు కూడా.

"ఇదేమిటి ఇలాగవుతోంది?"


"చచ్చినా వెళ్లాలని లేదా ఏమిటి కొంపదీసి ముసిలాడికి?"

"అందర్నీ ఇంత దుఃఖపెడుతున్నాడు దేనికో?"

ఇలా తలొకరూ తలొక విధంగా గుసగుసలాడుతున్నారు. ఇంట్లో కావలసినవారికి కూడా సహనం నశిస్తున్నది. అంతవరకూ ఎవరూ కాఫీచుక్కయినా తాగలేదు! అందరూ తల్లు పట్టుకు కూర్చున్నారు.

ఇంతలో అక్కడే ఉన్న ఆనందరావుగారి స్నేహితుడు విశ్వనాథంగారికి ఆనందరావు తరచూ తనతో అన్న మాటలు జ్ఞాపకం వచ్చి ఆనందరావు కొడుకుతో...

"బాబూ అంత్యక్రియలకు మీ నాన్నగారిని 'స్వర్గద్వారం' స్మశానానికి తీసుకువెళ్లండి. ఈ చెత్త స్మశానంలో దహనం చేయడం అతనికి ఇష్టం లేదు. నాతో ఎన్నోసార్లు ఆ మాటచెప్పారు. అంచేత అక్కడకు తీసుకువెళ్లే ప్రయత్నం చేయండి! చూద్దాం! అతని కోర్కె అదే కాబట్టి



తీసుకువెళ్లనివ్వలేదేమో!" అని సలహా ఇచ్చారు.

"అదేమిటండీ ప్రాణం పోయినాక ఎక్కడయితేనేమిటి? ఎక్కడికి తీసుకువెళుతున్నామో ఏమిటో తెలుస్తుందా? ఏమైనా మీ చాదస్తం గాని ఏదో మాటవరసకి అలా అని ఉంటారు."

"అలాక్కాదు నాయనా! అతని ఆఖరి కోర్కె తీరుస్తామనడంలో తప్పులేదు. కాస్త ఖర్చు ఎక్కువయితే అవుతుంది! అంతే!"

"ఖర్చుల కోసం కాదు బాబాయిగారు! ప్రాణం పోయేక కూడా ఇలాంటి సెంటిమెంట్లు ఉంటాయా అని?"

"పుట్టుక గిట్టుక ఎవరికయినా తప్పవు. కష్టాలూ, సుఖాలూ అలాగే తప్పవు. అలాగని కష్టాలను ఎవరూ కోరుకోరు కదా! అలాగే జీవుడు బ్రతికున్నన్నాళ్లూ హాయిగా, సుఖంగా బ్రతకాలని కోరుకుంటారు. చనిపోయేటప్పుడు కూడా ప్రశాంతంగా చనిపోవాలని అనుకుంటాడు. కర్మకాండ అంతా జరిగేవరకూ జీవుని ఆత్మ మన నంటిపెట్టుకూనే ఉంటుందంటారు. అంతా తృప్తిగా జరిగినప్పుడే ఆ ఆత్మకు శాంతి లభిస్తుంది. దానినే 'ఆత్మశాంతి' అని అంటుంటారు. ఆ చనిపోయిన వాని మీద మనకు గల గౌరవం - మనం చూపే శ్రద్ధాభక్తుల వల్ల చేసే కార్యక్రమాల వల్లా అది లభిస్తుంది" అని అన్నారు.

అది విని "పోనీ అలాగే కానిద్దురూ పెద్దవారు మంచికో, దేనికో చెప్పారు. ఇందులో ఏం పోయింది? శవాన్ని ఎంతకాలం అట్టేబెట్టుకుంటారు?" అని అందరూ అన్నారు.

"అలాగేచేద్దాం! 'స్వర్గద్వారం'కే తీసుకువెళదాం!" అని ఆనందరావు కొడుకూ, మిగతా బంధువులూ ఆ నిర్ణయానికి వచ్చారు.

అప్పుడే వర్షం తగ్గుముఖం పట్టి చిన్నచినుకులు మాత్రం పడతున్నాయి. మరికొద్దిసేపటికి వర్షం చినుకులూ మాయమై తెరిపి ఇచ్చింది. ఒకప్రక్కనుండి వెలుతురు వచ్చి నీరెండ కాయడం ప్రారంభించింది! అంతసేపూ అక్కడ వర్షం కురిసిందా? అన్నట్టు ఉంది. అందరూ సంభ్రమాశ్చర్యాలు పోతూ ఆనందరావుగారి భౌతికకాయన్ని స్వర్గద్వారానికి తీసుకువెళ్లారు. మరి వర్షంగాని, చినుకుగాని పడలేదు. ఏ ఆటంకాలు లేకుండా ఆనందరావుగారి అంతిమయాత్ర సాగిపోయింది.

'స్వర్గద్వారం' స్మశానంలో ఆనందరావుగారి అంత్యక్రియలు నిర్విఘ్నంగా జరిగిపోయాయి. ■

## ముఖే ముఖే సరస్వతీ!



### అసమర్థుని జీవనయాత్ర

నేను లెక్కలేనన్ని పుస్తకాలను చదివివుంటాను. వాటిలో చాలా వాటిని మర్చిపోయాను. కొన్ని ఎప్పటికీ మర్చిపోలేని పుస్తకాలు వున్నాయి. నేను ఎన్నటికీ మర్చిపోలేనిది, బాగా ఆకట్టుకున్నది 'గోపీచంద్' నవల 'అసమర్థుని జీవనయాత్ర'.

మానవ జీవితం జాతి గుఱ్ఱం లాంటిది. రౌతుకు గుఱ్ఱంమీద అదుపు ఉండి తీరాలి. లేకపోతే రౌతును క్రింద పడేసి గుఱ్ఱం పారిపోవచ్చు. లేక పాదాలతో తొక్కి చంపేయవచ్చు. అలాగే మనిషికి జీవితం మీద అదుపు ఉండాలి. ఉంటే జీవితం పూలపాన్పు అవుతుంది. అదుపు లేకపోతే నరకప్రాయం అవుతుంది. ఈ నవలలో సీతారామారావు మంచి దర్జా అయిన కుటుంబంలో పుట్టినవాడు. మనిషి ముందు విచిత్రంగా తరువాత విశితంగా, వింతగా ఆలోచించడం, ప్రవర్తించడం ప్రారంభించాడు. క్రమక్రమంగా జీవితం మీద, మనసు మీద పూర్తిగా అదుపు తప్పి, ఆఖరికి అతని జీవిత కథ అత్యంత దయనీయంగా, ఘోరంగా ముగుస్తుంది.

ఇది యాభైదశకంలో వచ్చిన కొత్త తరహా నవల. హేతువాది, మానవతావాది అయిన గోపీచంద్ ఆంధ్ర నవలా సాహిత్యానికి అందించిన అపురూప కానుక 'అసమర్థుని జీవనయాత్ర'.

మామిడి శ్రీలత, రేపల్లె

### రసరేఖలు

"పుస్తకం హస్త భూషణం" అని ఆనాడు అంటే, 'సెల్ ఫోన్ హస్త భూషణం' అని నేటి యువత అంటున్నారు. మగవారితో సమానంగా చదువుకున్న ఆడపిల్లలు సహితం కట్నాలు, లాంఛనాల మాదిరిగా ఇవ్వడానికి ఇష్టపడుతున్నారు. బహుమతులు అంటే గతంలో మాలతీ చందూర్ వంటల పుస్తకం, విశ్వనాథ సాహిత్యం వంటివి ఇచ్చేవారు. అది చదివి జీవితాలను చక్కదిద్దుకునేవారు. ఇప్పుడంతా లామినేషన్స్, ప్లాస్టిక్ గిఫ్ట్స్ రాజ్యం ఏలుతున్నాయి. పఠనాశక్తి కల్గేలా యువతను మార్చాలి. ప్రస్తుతం సైబర్ యుగంలో సైబర్స్‌లా ఎగిరి పోతున్నారు. నాకు చిన్నప్పటి నుంచి పుస్తకాలు చదవడం జీవితధ్యేయము. సూర్యోదయంతో పాటు పేపర్ చదువుతాను. ఆరోజు పేపర్‌కి సెలవైతే పాత పేపర్స్ అయినా తిరగవేస్తాను. ముఖ్యంగా నాకు నచ్చిన రచనలు, స్ఫూర్తినిచ్చిన రచయిత డా॥ సంజీవదేవ్. ఆయన పుస్తకం 'రసరేఖలు'. ఇవన్నీ కూడా నాకు చిత్రకళలో మరింత అభిరుచిని పెంచి సాహిత్యంలో మక్కువ పెంచాయి. మంచి భావతో ఇంగ్లీషు పదాలతో చాటుపులుగా ప్రతి వాక్యం ఎన్నో రకాల సూక్తులను అందిస్తాయి. ఒక పుస్తకం చదివాము అంటే కాలక్షేపానికి కాదు. అది జీవనశైలిపై ప్రభావితం కావాలి. ముఖ్యంగా లైబ్రరీకి వెళ్లే అలవాటు ఉంటే అక్కడ లైబ్రరియన్ మనల్ని ఏ పుస్తకాలు చదవాలో కూడా సజెక్ట్ చేస్తూ ఉంటారు. నాకు అలా మంచి లైబ్రరియన్, మా అమ్మగారి సజెషన్స్ ప్రకారం నేను మంచి పుస్తకాలు చదవడమే గాక ఒక రచయిత్రిగా ఈనాడు 4,864 ఆర్టికల్స్‌ని వివిధ రంగాలపై పాఠకులకు అందించగలిగాను. ఇప్పటికి బాలమిత్ర, చందమామ, రష్యన్ సాహిత్యపు పిల్లల కథలంటే చాలా ఇష్టం. ముఖ్యంగా సంజీవదేవ్‌గారి రసరేఖల్లో కళారూపాలు, వాని విన్యాసాలు, జీవితంలో కళారూపాల ప్రాధాన్యత ఇత్యాది కొటేషన్స్‌లో అత్యంత ప్రీతికరమైన విధానంలో పుస్తకం సాగుతుంది. ప్రతి వాక్యంలో ఒక్క కొటేషన్ ఉండి పదే పదే చదివించ చేస్తుంది. ఆయన డెప్త్ అర్థం చేసుకోగలిగితే తప్పక మంచి ప్రముఖ వ్యక్తిగా జీవితాన్ని మలచుకోగలరు. ఇవి జీవితాన్ని మలచుకొనే రచనలు.

కె. వాణీప్రభాకరి